ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 154 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 12 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# ప్రపంచంలో సగం జనాభాకు బ్రిక్స్ దేశాలు ప్రాతినిధ్యం

**40 శాతానికి పైగా ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా**

**జీ7 వాటా 29 శాతమేనని వెల్లడి**

**భారత్ ఐటీ కంపెనీలు ప్రపంచంలోనే అగ్రగామిగా పని చేస్తున్నాయి**

**బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయన్న పుతిన్**

**న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరం'లో పుతిన్**




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉం దని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరం'లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు.బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు.బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పు దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.

## రైతుల మోటార్లకు
# మీటర్లు పెట్టబోము



**అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**

రైతుల మోటర్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోమని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డీఎస్ఎస్ పథకాన్ని వినియోగించుకుంటామన్నారు. అందులో ఎక్కడా వ్యవసాయ మోటర్లకు మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదని భట్టి విక్రమార్క తెలిపారు. అలాంటి భయాందోళన సృష్టించవద్దని ఆయన సూచించారు. థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటూ వెళ్లాల్సిన అవసరముందని భట్టి విక్రమార్క తెలిపారు.రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించడానికి ప్రభుత్వం ఏటా రూ.14 వేల కోట్లు, 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 5 వేల కోట్లు

..మిగతా 2లో

## విద్యా వ్యవస్థలోని లోపాలను
# సరిదిద్దేందుకు కమిషన్
## విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం

**చదువుకు దూరమైతే ఎంత ఆస్తి ఉన్నా సామాజికంగా వెనుకబడే పరిస్థితి**

**28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులు**

**అక్షరం ఒక్కటే మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది**

**అసెంబ్లీలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**

విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమన్న సీఎం ప్రత్యేక విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని ఏడాదిలో 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు ప్రకటించారు. 10,600 మంది టీచర్లకు 55 రోజుల్లో నియామక పత్రాలిచ్చినట్లు వెల్లడించారు. విద్యే జీవితాలను మార్చే శక్తి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుకు దూరమైతే ఎంత ఆస్తి ఉన్నా సామాజికంగా వెనుకబడే పరిస్థితి ఉంటుందని చెప్పారు. 2024లో నిర్వహించిన సీపెక్ సర్వేలోనూ ఇదే విషయం వెల్లడైందన్నారు. అక్షరం ఒక్కటే మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా తెలంగాణ విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చుతున్నామని అసెంబ్లీలో తెలిపారు. రాష్ట్రంలో

..మిగతా 2లో

# బొల్లారంలో తుపాకులు, మందుగుండు సామాగ్రి చోరీ కేసు



**మిస్టరీని చేధించిన పోలీసులు**

**త్వరితగతిన రిటైర్డ్ అయ్యాననే అసంతృప్తితోనే చోరీ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**

సికింద్రాబాద్ బొల్లారంలో ఉన్న 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్ నుంచి భారీ స్థాయిలో తుపాకులు, మందుగుండు సామగ్రి చోరీకి గురైన కేసును తెలంగాణ పోలీసులు ఛేదించారు. ఈ దొంగతనానికి పాల్పడిన విశ్రాంత ఆర్మీ హవిల్దార్‌ను సెప్టెంబర్ 11న ప్రత్యేక బృందాలు అరెస్ట్ చేశాయని

..మిగతా 2లో



## జాతీయ మహిళా కమిషన్‌కు
# సబిత ఫిర్యాదు

2

**రేవంత్ డైరెక్షన్‌లోనే... మహిళా ఎమ్మెల్యేలపై దాడి**

**దేశంలోనే ఎక్కడాలేని విధంగా తెలంగాణలో కౌరవసభ**

# చెరువుల హద్దులకు రక్షణ కవచం

**ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడబోం**

**మత్స్యకారుల బతుకులకు భరోసా**

2

**అన్ని చెరువులకు పరిరక్షణ కమిటీల ఏర్పాటు**

**నెల్లికల్ ఎత్తిపోతల పథకంపై సభాముఖంగా విస్పష్టమైన హామీ**

**శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

# రేవంత్ వచ్చాక పెరిగిన భూదందా: కేటీఆర్

**మంత్రి పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు.. భూ భారతి పేరుతో ప్రజల భూములకు హారతి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**



కొంగరకలాన్‌కు ఫాక్సకాన్ వంటి దిగ్గజ కంపెనీ తెచ్చి ప్రాంతపు రూపురేఖలు మార్చితే, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 200 కోట్ల విలువైన భూమిని తన తమ్ముడికి చెందిన కంపెనీకి కేవలం రూ. 7 కోట్లకే అడ్డికి పావుశేరు లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ. 1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత జాబితా అయిన 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాకముందు రియల్ ఎస్టేట్ రంగానికి ఎలాంటి భరోసా లేదని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను తీర్చి భూముల విలువను ఊహించని స్థాయికి

..మిగతా 2లో

# విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు కమిషన్

మొదటి పేజీ తరువాయి...

విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కొత్త మార్గదర్శకాలు రూపొందించేందుకు కేశవరావు కమిటీని నియమించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. వీరికి 1.57 లక్షల మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారని చెప్పారు. జెన్ జీతో పాటు జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల భవిష్యత్తును తరగతి గదుల్లోనే తీర్చిదిద్దుతామని అన్నారు. ఉపాధ్యాయుల నియామకంలో తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో 7,857 మంది టీచర్లను మాత్రమే



నియమించిందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని వెల్లడించారు. ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా 55 రోజుల్లో 10,600 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించామని తెలిపారు. రైట్ టు ఎడ్యుకేషన్ ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి, తెలంగాణలో 17 మందికే ఒక ఉపాధ్యాయుడు ఉన్నారని వివరించారు. విద్యా రంగానికి గతంలో తగ్గుతూ వచ్చిన బడ్జెట్ కేటాయింపులను తమ ప్రభుత్వం పెంచుతోందని సీఎం చెప్పారు. అసెంబ్లీ సభ్యులు ఇచ్చిన సూచనలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తెలంగాణ విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యమన్నారు. దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు పునాదులు వేసిన పండిట్ నెహ్రూ ఆలోచనలతో ముందుకు సాగుతామని తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# బొల్లారంలో తుపాకులు, మందుగుండు సామాగ్రి చోరీ కేసు

మొదటి పేజీ తరువాయి...

ఉప్పుతోళ్ల మల్లేష్ (37)గా పోలీసులు గుర్తించారు. నిందితుడు 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్‌లో హవిల్దార్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. పోలీసులు వెల్లడించిన కథనం ప్రకారం... మల్లేష్ 2010లో భారతీయ సైన్యంలో చేరి దాదాపు 16 సంవత్సరాల పాటు వివిధ ప్రాంతాల్లో సేవలు అందించాడు. 2026 జూన్ 30న ఈయన ఉద్యోగ విరమణ పొందాడు. అయితే త్వరితగతిన సైన్యం నుండి పదవీ విరమణ పొందాల్సి రావడం, దానివల్ల ఏర్పడిన తీవ్ర అసంతృప్తి, కోపమే ఈ దొంగతనానికి ప్రధాన కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. తన ప్లాన్ ప్రకారం ఆగస్టు 30, 31 మధ్యరాత్రి సమయంలో దాదాపు 11:00 గంటల ప్రాంతంలో బోల్లారంలోని 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్ ఆవరణలోకి మల్లేష్ ప్రవేశించాడు. అక్కడున్న 'కోట్' గది, మ్యాగజైన్ రూమ్ తాళాలు తొలగించి, అత్యంత ఆధునిక ఆయుధాలు, భారీగా తుపాకీ గుళ్లను దొంగిలించి పరారయ్యాడు. ఈ ఘటనపై మద్రాస్ రెజిమెంట్ అధికారుల నుండి ఫిర్యాదు అందగానే బొల్లారం పోలీసులు భారతీయ న్యాయ సంహిత (దీబీూ) సెక్షన్లు 331(4), 305 కింద కేసులు నమోదు చేశారు. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏసీపీ స్థాయి అధికారి విచారణ బాధ్యతలను స్వీకరించారు.

పక్కా సమాచారం ఆధారంగా... బొల్లారం ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ మరియు మల్కాజ్‌గిరి ఎస్ఓటీ బృందాలు సంయుక్తంగా దాడి చేసి నిందితుడు మల్లేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన ఆయుధాలను నిందితుడు యాప్రాల్‌లోని కౌకూర్ వద్ద ఉన్న తన నివాసంలో మరియు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని స్థావరంలో దాచిపెట్టినట్లు పోలీసులు కనుగొన్నారు. ఆయుధాలన్నింటినీ స్వాధీనం చేసుకున్న పోలీసులు.... సెప్టెంబర్ 11న మల్లేష్‌ను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

**చోరీకి గురైన ఆయుధాల వివరాలు:**

కోట్-హెచ్‌క్యూ, మ్యాగజైన్ గదుల నుంచి నిందితుడు దొంగిలించిన ఆయుధాల జాబితాను పోలీసులు విడుదల చేశారు. ఆ వివరాలు కింది విధంగా ఉన్నాయి...

5 మ్యాగజైన్‌లతో కూడిన నాలుగు ఏకే-203 (7.62ఇ39ఎఎ) రైఫిళ్లు

3 మ్యాగజైన్‌లతో కూడిన ఒక 5.56ఎఎ ఇన్సాస్ (×చీ-ూూ 1దీ1) రైఫిల్

12 మ్యాగజైన్‌లతో కూడిన ఆరు 9ఎఎ ఆటో 1ూ పిస్టళ్లు

మ్యాగజైన్‌తో కూడిన ఒక సివిలియన్ 6.35-బోర్ పిస్టల్

ఒక పాసివ్ నైట్-విజన్ బైనాక్యులర్ (రాత్రి వేళ చూసే దుర్భిణి)

9ఎఎ ఆటో 1ూ పిస్టల్‌కు చెందిన 1,156 రౌండ్ల సజీవ మందుగుండు సామగ్రి

ఏకే-203 రైఫిళ్లకు చెందిన 720 రౌండ్ల తూటాలు

5.56ఎఎ ఇన్సాస్ తుపాకీకి చెందిన 11 బాల్ రౌండ్లు, 5 ట్రేసర్ రౌండ్లు మరియు 20 బ్లాంక్ రౌండ్లు

# చెరువుల హద్దులకు రక్షణ కవచం

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**

చెరువు నిండితే పల్లె పచ్చబడుతుందని, మత్స్య కారుడి వల నిండితే అతని కుటుంబంలో వెలుగులు విరుస్తాయని, అందుకే చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చెరువుల పూర్తి నీటిమట్టం ఫుల్ ట్యాంక లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, జలవనరుల ఆక్రమణలను ఉపేక్షించ బోమని ఆయన శాసన మండలి వేదికగా ప్రకటించారు. శుక్రవారం శాసన మండ లిలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానమిచ్చారు. చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దు లు దెబ్బతిన్నా, జలవనరులు ఆక్రమణ లకు గురైనా, వాటిపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలకు నష్టం వాటిల్లినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు. సభ దృష్టికి తీసుకొచ్చిన నిర్దిష్ట సమస్యను నీటిపారుదల శాఖ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. వారం రోజుల్లోగా సంబంధిత చెరువును సందర్శించి, జలవనరుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, స్థానిక మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. "చెరువులు, వాటి ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణకు నేను సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. ఎక్కడైనా ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, ఆక్రమణలు జరిగినా, మత్స్యకారులకు అన్యాయం వాటిల్లినా నిర్దిష్ట వివరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురండి. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి సభకు భరోసా ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో సుమారు 2,150గా ఉన్న మత్స్య సహకార సంఘాల సంఖ్య ప్రస్తుతం ఆరు వేలకు పైగా పెరిగిందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా సంఘాల సభ్యత్వం సుమారు రెండు లక్షల నుంచి 6.5 లక్షలకు చేరిందని వివరించారు. చెరువులు, ఇతర జలవనరుల పరిరక్షణలో మత్స్య సహకార సంఘాలకు మరింత క్రియాశీలమైన పాత్ర కల్పిస్తూ సమగ్ర విధానాన్ని రూపొందించాలని సభ్యులు కోరారు. జలవనరుల ఆరోగ్యంతోనే మత్స్యకారుల జీవనోపాధి ముడిపడి ఉన్నందున, చెరువుల పర్యవేక్షణ, చేప పిల్లల సంరక్షణ, ఆక్రమణలు లేదా ఇతర ముప్పులను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో మత్స్యకార సంఘాలు స్థానిక సంరక్షకులుగా సమర్థవంతమైన పాత్ర పోషించగలవని సూచించారు. రాష్ట్రంలోని అన్ని చెరువులకు పరిరక్షణ, నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇటువంటి కమిటీలు పనిచేశాయని, అనంతర కాలంలో ఆ వ్యవస్థ నిలిచిపోయిందని తెలిపారు. జలవనరుల సమర్థ నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, ఆక్రమణల నిరోధానికి కమిటీల వ్యవస్థను పునరుద్ధరించాలని వచ్చిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ పూర్తయిందని మంత్రి తెలిపారు. ఈ సమగ్ర సమాచార వ్యవస్థ చెరువుల స్థితిగతులను పర్యవేక్షించడంతో పాటు వాటి పరిరక్షణకు అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు బలమైన ప్రాతిపదికగా ఉపయోగపడు తుందని చెప్పారు. చెరువుల పరిరక్షణకు అదనపు నిధులు అవసరమైతే వాటిని సమకూర్చేందుకు ప్రభుత్వం వెనుకాడ బోదని స్పష్టం చేశారు. చెరువుల సంరక్షణ, ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణ, మత్స్యకారుల జీవనోపాధికి భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య అంశాలని పునరుద్ఘాటించారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ 2027 నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి, సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ శాసన మండలి సాక్షిగా విస్పష్టమైన హామీ ఇచ్చారు. నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా గుర్తించిందని చెప్పారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించుకున్న గడువులోగా రెండు దశలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. తొలి దశలో జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు సాగునీరు అందిస్తామని, మిగిలిన సుమారు 16 వేల ఎకరాలకు డిసెంబర్ 2027 నాటికి నీరందించి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. "సభాముఖంగా విస్పష్టమైన హామీ ఇస్తున్నాను. మొదటి దశను జూన్ 2027 కంటే ముందుగానే పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. డిసెంబర్ 2027 నాటికి మొత్తం ప్రాజెక్టును పూర్తి చేసి, 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనులకు కేవలం రూ.25.42 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని మంత్రి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు రూ.310.681 కోట్లు విడుదల చేసి, దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు పనులకు వేగం పెంచిందన్నారు. తాను స్వయంగా రెండుసార్లు ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించానని, నీటిపారుదల శాఖ కార్యదర్శి కూడా రెండుసార్లు సందర్శించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. నెల్లికల్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలన్నది ప్రభుత్వ ధృఢ సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యం, గోధుమలు, చక్కెరతోపాటు మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌తోపాటు పలువురు సభ్యులు చేసిన సూచనలపై మంత్రి స్పందించారు. పీడీఎస్ పరిధిలోకి అదనపు సరుకులను తీసుకురావడం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అందుకు అవసరమయ్యే ఆర్థిక భారాన్ని సమగ్రంగా అంచనా వేస్తున్నామని తెలిపారు. "అదనపు నిత్యావసర సరుకుల పంపిణీ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నాం. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం ఆహార భద్రతను కల్పిస్తోందని, అయితే పేద కుటుంబాలకు పోషక భద్రతను అందించాలంటే పప్పులు, వంట నూనెలు వంటి సరుకులను కూడా చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని సభ్యులు సూచించారు. దీనివల్ల పేదల ఆహారంలో పోషక విలువలు పెరగడంతోపాటు రాష్ట్రంలో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. చౌకధరల దుకాణాల ఆర్థిక స్థిరత్వం మెరుగుపడి, భవిష్యత్తులో అవి "పేదల సూపర్ బజార్లు"గా రూపాంతరం చెందే అవకాశం ఉంటుందని సభ్యులు అభిప్రాయపడ్డారు.

# రేవంత్ వచ్చాక పెరిగిన భూదందా: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి...

తీసుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు ఎకరం రూ. 5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ. 50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూమి కనిపిస్తే బుక్క పెట్టు జాగా కనిపిస్తే పాగా వేరు అనే చందంగా దందాలు నడుస్తున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న లీడర్లు గజదొంగల్లా మారారని ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, కానీ నేటి కాంగ్రెస్ భూ భారతి అవతారంలో భూముల గోల్‌మాల్‌ను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్న ఈ కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని, ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమాలపై న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన నిషేధిత భూముల జాబితా (22ఏ) వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో ప్రజల భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆయన ఆరోపించారు. . ప్రస్తుత ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనను పూర్తిగా పక్కనపెట్టి, కేవలం భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని హరీశ్ రావు దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల పాలిటెక్నిక కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేశందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే చాలంటూ ప్రచారం చేసుకున్నారని, కానీ బాధితులు నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినా ఎలాంటి న్యాయం జరగడం లేదని విమర్శించారు. మరోవైపు హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం, బడా బాబులు నిర్మించిన భారీ అక్రమ కట్టడాల జోలికి మాత్రం వెళ్లడం లేదని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి నివాసాన్ని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్న వారు, అదే జాబితాలో నానా ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజల భూములు, ఇళ్లను ఎందుకు తొలగించడం లేదని సూటిగా నిలదీశారు. తక్షణమే పేదల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి రాజీలేని పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.



# కీర్తి ముదిరాజ్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

## తెలంగాణ భవన్‌లో శాలువాతో సన్మానించిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ కీర్తి ముదిరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆమె జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రత్యేకంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు కీర్తి ముదిరాజ్‌ను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కీర్తి ముదిరాజ్‌కు పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మహిళలను సంఘటితం చేయడంలో కీర్తి ముదిరాజ్ చేస్తున్న కృషిని నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ కాలనీ అధ్యక్షులు రాము ముదిరాజ్, కాలనీ వాసులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొని కీర్తి ముదిరాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రైతుల మోటార్లకు
# మీటర్లు పెట్టబోము

మొదటి పేజీ తరువాయి...

చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ విధంగా కేవలం సబ్సిడీల రూపంలోనే ఏటా దాదాపు రూ.19 వేల కోట్లు ఖర్చవుతోందని ఆయన వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయంసమృద్ధి సాధిస్తారన్నారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్ రాత్రివేళ అందుబాటులో ఉండనందున, ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌తో మైక్రో గ్రిడ్లను నిర్మిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్ విద్యుత్‌తో పాటు బ్యాటరీ స్టోరేజ్ ద్వారా గ్రామాలకు విద్యుత్ ఇచ్చే 'మైక్రో గ్రిడ్' ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా(పైలట్) చేపట్టామని ఆయన మండలిలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వీజీఎఫ్ ద్వారా మూడు సార్లు టెండర్లు పిలిచినా, బ్యాటరీ స్టోరేజ్ ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో సాంకేతికత పెరిగి బ్యాటరీ ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా పర్యావరణహితమైన హరిత ఇంధన రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 విశేషాలను వివరించారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కేవలం 15,497 మెగావాట్లుగా మాత్రమే ఉండేదని, అయితే సెప్టెంబర్ 9 నాటికి అది 19,543 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. వివిధ కారణాల రీత్యా ఈ ఏడాది డిమాండ్ 20 వేల నుంచి 21 వేల మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని, ఈ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే సాంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ ఈ నూతన పాలసీని తెచ్చినట్లు తెలిపారు. పీఎం-కుసుమ్ పథకం కింద రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు భట్టి వెల్లడించారు. ఒక్కొక్కరు 2 మెగావాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టగా పూర్తి సోలరైజేషన్ పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని, ఇటీవల కరీంనగర్‌లో ఒక ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. మణుగూరు వద్ద సింగరేణి చేపట్టిన మిథేన్ గ్యాస్ ప్రాజెక్ట ఖర్చు ఎక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాలేదని, అయితే కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం జరుపుతున్నామని తెలిపారు.

## జాతీయ మహిళా కమిషన్‌కు
# సబితా రెడ్డి ఫిర్యాదు

**న్యూఢిల్లీ సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా రెడ్డి డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి డివిజన్ అధ్యక్షులు కృషి చేయాలి: ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



సామ ఇంద్రపాల్ రెడ్డి కి నియామక పత్రాన్ని అందచేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి లు



డివిజన్ అధ్యక్షులుగా నియమితులైన నాయకులతో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి లు

**బుద్వేల్, సెప్టెంబరు 11 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేయడానికి నూతనంగా నియమితులైన డివిజన్ అధ్యక్షులు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డి లు కోరారు. శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాం పు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్ అధ్యక్షులుగా నియమితులైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలన ప్రజా పాలన అని గుర్తు చేశారు. పట్టణాలలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 20వేల లీటర్ల వరకు ఉచితంగా రక్షిణ నీటి సరఫరా, రేషన్ కార్డుల పంపిణీ, వివిధ రకాల ఫించన్ల పంపిణీ, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు అమలు చేస్తు ప్రజలకు మేలు చేస్తున్నామన్నారు. గ్రామాలలో రైతు బంధు, ఉచిత విద్యుత్ సౌకర్యం, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక పథకాలు ప్రవేశ పెడుతు ముందుకు సాగుతున్నామన్నారు. ఇటీవల పట్టణాలలో సైతం ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి దరఖాస్తులు స్వీకరించి లాటరీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇలా అనేక పథకాలను ప్రజల కోసం ప్రవేశపెట్టి ప్రజా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పాలన గురించి పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వారు ప్రజలలోకి తీసుకువెళ్లాలన్నారు.

**నూతనంగా ఎంపికైన డివిజన్ అధ్యక్షులు వీరే :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదర్ గూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉప్పర్ పల్లి కి కి చెందిన సామ ఇంద్రపాల్ రెడ్డి నియమితులైనారు. ఆయనకు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డి లు నియామక పత్రాలను అందజేశారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేయాలని కోరారు. అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులుగా గోవర్ధన్ రెడ్డి, సులేమాన్ నగర్ డివిజన్ అధ్యక్షులుగా మహ్మద్ గౌస్, శాస్త్రీపురం డివిజన్ అధ్యక్షులుగా శ్రీకాంత్, కాటేదాన్ డివిజన్ అధ్యక్షులుగా ధనుంజయ్, మైలార్దేవుపల్లి డివిజన్ అధ్యక్షులుగా టి . ప్రేంగౌడ్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులుగా పడమటి శ్రీధర్ రెడ్డిలకు నియామక పత్రాలను అందజేశారు.

## బూడిద, బొగ్గు నిర్వహణ విభాగాల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ టెండర్లను వెంటనే నిలిపివేయాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం "జూరాల హైడ్రో విద్యుత్ కేంద్రం "లో సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయంలో ఉద్యోగులు బైఠాయించి నిరసనను వ్యక్తం చేశారు. ఆగస్టు 29న టీజీపీఈజేఏసీ ప్రతినిధులు, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల సీఎండీలతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఆయా సమస్యలపై రెండు వారాల్లో మరోసారి సమావేశం నిర్వహించి చర్చిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది.అయితే ఇచ్చిన హామీకి విరుద్ధంగా జెన్‌కో యాజమాన్యం యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని బూడిద నిర్వహణ విభాగం, బొగ్గు నిర్వహణ విభాగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు టెండర్లను ఖరారు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు టీజీపీఈజేఏసీ నేతలు ఆరోపించారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కేంద్ర టీజీపీఈజేఏసీ పిలుపు మేరకు సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. యాదాద్రి విద్యుత్ కేంద్రంలోని బూడిద, బొగ్గు నిర్వహణ విభాగాల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ టెండర్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మన హక్కులు మన సంస్థలు మన బాధ్యత" అనే నినాదంతో ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీపీఈఏ జూరాల కాంప్లెక్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ఎస్ పి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

## రేపల్లెలో మాదిగల ఇండ్ల కూల్చివేతను నిరసిస్తూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

గద్వాల మండలం రేపల్లె గ్రామంలో కుల వివక్షతో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఇండ్లను అన్యాయంగా కూల్చివేసిన నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ , వివిధ ప్రజా సంఘాల నాయకులు బాధితులతో కలిసి జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు కొంకల భీమన్న మాదిగ, ఐజ రాజు మాదిగ మాట్లాడుతూ ... "రేపల్లె గ్రామానికి చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన రంగముని, అదే గ్రామానికి చెందిన బి సి (బోయ) సామాజిక వర్గానికి చెందిన మహేశ్వరి పరస్పరం ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. తమ కుమార్తెను తక్కువ కులానికి చెందిన వ్యక్తి పెళ్లి చేసుకున్నాడనే కుల అహంకారంతో, గ్రామంలో మాదిగ సామాజిక వర్గం జనాభా తక్కువగా ఉందనే అణచివేత ధోరణితో అమ్మాయి మేనమామ (సర్పంచ్) ఉద్దేశపూర్వకంగా వెనుక ఉండి ఈ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు.గ్రామంలో బాధితుల ఇండ్లను అన్యాయంగా కూల్చివేయడం పట్ల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇండ్లు కోల్పోయిన బాధితులకు తక్షణమే పూర్తి న్యాయం చేకూర్చాలి అని బాధితులకు ప్రభుత్వమే నష్టపరిహారం అందించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని,కుల వివక్షతతో దాడులకు తెగబడి ఇండ్లు కూల్చివేసిన ప్రధాన సూత్రధారులు, వారి వెనుకున్న వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కురుమన్న, గంజిపేట రాజు, పరుశరామ్, కన్నా, కాంగ్రెస్ నాయకుడు మాల శ్రీనివాసులు, ఇమ్మనియేలు, ప్రజా సంఘాల నాయకులు ఆశన్న, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## గగన్ పహాడ్‌లో విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలి : బస్తీ వాసులు

**బుద్వేల్ , సెప్టెంబరు 11 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ సర్కిల్ గగన్ పహడ్ బస్తీ సర్వే నెంబర్ 295 లో ఖాళీగా ఉన్న 26 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని అదే బస్తీ కి చెందిన దళిత నాయకులు తలారి శ్రీరాములు, టీఆర్ ఈశ్వరయ్య, తలారి రత్నం, షేక్ మహమూద్, దళిత నాయకుడు నందిగామ నర్సింహ్మా డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి ని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గగన్ పహాడ్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో గ్రామ అవసరాల కోసం 26 గుంటల స్థలాన్ని గ్రామ పంచాయ తీ కొనుగోలు చేసిందన్నారు. 1987లో గ్రామ పంచాయతీలు నూతనంగా ఏర్పాటైన రాజేంద్రనగర్ మున్సి పాలిటీ లో విలీనమైన తర్వాత ఆ స్థలం గురించి ఎవరు పట్టించుకోలేదన్నారు. అదే అదనుగా కొందరు సదరు స్థలాన్ని ఆక్రమించాలని చూస్తుండగా అనేక పర్యాయాలు రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు, రాజేంద్రనగర్ ఆర్డీవో కు. రాజేంద్రనగర్ తహసీల్దార్ కు వినతి పత్రాలు ఇస్తునే ఉన్నామన్నారు. బస్తీ అవసరాల కోసం ఆ స్థలాన్ని వాడుకోవాలన్నారు. కమ్యూనిటీ హాల్, మల్టీ లెవల్ ఫార్కింగ్ లేదా ఫంక్షన్ హాల్ నిర్మించాలని పలుమార్లు అధికారులను కలసి విన్నవించుకున్నామన్నారు. ఆ



గగన్ పహాడ్ లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి



స్థలానికి సంబందించిన కొనుగోలు పత్రాలను కూడా అధికారులకు చూపించడం జరిగిందన్నారు.

**జోనల్ కమిషనర్ ను కలసి ఫిర్యాదు చేసిన గగన్ పహడ్ బస్తీ వాసులు**

గగన్ పహాడ్ బస్తీలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గురించి స్థానికులు రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కి వివరించారు. ఎకరం రూ.60 కోట్లు పలికే గగన్పహడ్ లో 26 గుంటల ప్రభుత్వ భూమిని ( రాజేంద్రనగర్ మున్సిపాలిటీకి కేటాయించిన) కాపాడాలన్నారు. లేనట్లయితే పక్కనే ఉన్న 296 సర్వే నెంబర్ లో అనధికారికంగా కొన్న ప్లాట్ల యజమానులు 295 సర్వే నెంబరు లోని స్థలాలను కబ్జా చేస్తున్నారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.



రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి కి వినతి పత్రం అందచేస్తున్న గగన్ పహాడ్ బస్తీ ప్రజలు

స్థలం చూసి రక్షణ చర్యలు చేపట్టాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీ కి సూచించిన డిప్యూటీ కమిషనర్ :

గగన్ పహడ్ లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని చూసి దానిని రక్షించడానికి చర్యలు తీసుకోవాలని రాజేం ద్రనగర్ టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ కి డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

**హైడ్రా అధికారులు జోక్యం చేసుకోవాలి : తలారి శ్రీరాములు**

గగన్ పహడ్ లో ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండ హైడ్రా అధికారులు జోక్యం చేసుకోవాలని గగన్పహడ్ లో ప్రభుత్వ స్థలాన్ని కాపాడటానికి అనేక రోజులుగా పోరాడుతున్న తలారి శ్రీరాములు కోరారు. లేనట్లయితే కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉం దని వాపోయారు.





పోలీస్ స్టేషన్ లో చిన్నారి కుటుంబ సభ్యులు

## తప్పి పోయిన బాలుణ్ణి తల్లి చెంతకు చేర్చిన అత్తాపూర్ పోలీసులు

**బుద్వేల్, సెప్టెంబరు 11 (ప్రభాత ఉదయం)**

ఇంటి వద్ద ఆడుకుంటు కనిపించకుండ పోయిన సం వత్సరం వయస్సున్న బాలుణ్ణి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు అత్తాపూర్ పోలీసులు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... అత్తాపూర్ కు చెందిన మహ్మద్ ఖమ్రుద్దీన్, సపూర బేగం లకు సంవత్సరం వయస్సున్న కుమారుడున్నారు. గురువారం ఇంటి వద్ద ఆడుకుంటు కనిపించకుండ పోయాడు. తల్లిదం డ్రులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లో తమ కుమారుడు కనిపించడంలేదని ఫిర్యాదు చేశారు. అత్తాపూర్ పోలీసులు రంగంలోకి దిగి ఆ బాలుణ్ణి ఆచూకి కనుగొని 'ఇన్స్పెక్టర్ ఎ సీతయ్య సమక్షంలో తల్లిదం డ్రులకు అప్పగించారు.



## మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

### తగ్గించిన వేతనాలను వెంటనే పెంచాలి


**బుద్వేల్, సెప్టెంబరు 11 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర మునిసిపల్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు శుక్రవారం మంత్రి శ్రీధర్ బాబు ను కలసి వినతి పత్రం అందజేశారు. మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలన్నారు. మ ఎన్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్, వర్క్ ఇన్స్ పెక్టర్ ఎలక్ట్రిషియన్, లైన్మెన్, డ్రైవర్, వాటర్ మెన్, బిల్ కలెక్టర్, శానిటరీ జవాన్, సానిటరీ ఇన్స్ పెక్టర్, ఎన్ఎం ఆర్ కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలను పెంచాలన్నారు. మంత్రిని కలసి వినతి పత్రం అందజేసిన వారిలో తెలంగాణ మునిసిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం పల్లి జైపాల్ రెడ్డి, సీఐటీయు రాష్ట్ర అద్యక్షులు పాలడుగు సుధాకర్, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షులు కె సూర్యం, ఐఎన్టీయు రాష్ట్ర కార్యదర్శి పి శివబాబు, లు ఉన్నారు.

## వాటర్ హీటర్ పెట్టిన వేడి నీళ్ల బకెట్ లో పడి బాలికకు గాయాలు, ఆసుపత్రిలో చికిత్స పొందుతు మృతి

**బుద్వేల్, సెప్టెంబరు 11 (ప్రభాత ఉదయం) :**

మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి కాలనీ లో విషాదం చోటు చేసుకుంది. మహబూబ్ నగర్ కు చెందిన ఓ కుటుంబం ప్రగతి కాలనీ లో నివాసం ఉంటుంది. నాలుగు రోజుల క్రితం వారి ఇంట్లో వేడినీళ్ల బకెట్ లో వాటర్ హీటర్ పెట్టిన ఆ కుటుంబ యజమానురాలు ఫోన్ మాట్లాడుతుంది. అదే సమయంలో ఆమె కుమార్తె మానస (4) వేడి నీళ్ల బకెట్ లో పడి తీవ్ర గాయాలకు గురైంది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందుతు శుక్రవారం మరణించింది. అయితే ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని మైలార్దేవుపల్లి ఇన్స్ పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.



మానస

## అంజయ్యనగర్‌లో కిలో గంజాయి పట్టివేత

### కూకట్‌పల్లి ఎక్సైజ్ పరిధిలో ఎస్టీఎఫ్ బృందం తనిఖీలు -- మహిళపై కేసు నమోదు

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**



కూకట్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్టీఎఫ్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. సీఐ రమేష్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో గంజాయి విక్రయాలకు పాల్పడు తున్నట్లు అనుమానిస్తున్న ఓ మహిళ వద్ద నుంచి ఒక కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం.. అంజయ్యనగర్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్టీఎఫ్ బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో కుదినేత సోని అనే మహిళ వద్ద గంజాయి గుర్తించడంతో దానిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెపై కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. గంజాయి పట్టివేతలో సీఐ రమేష్‌తో పాటు ఎస్సై మధు, హెడ్ కానిస్టేబుల్ సంతోష్ ప్రసాద్, కానిస్టేబుళ్లు రవి, రాహుల్, రాజేశ్వరి, ఖలీద్ పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితురాలిని కూకట్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు సీఐ రమేష్ తెలిపారు. గంజాయి అక్రమ విక్రయాలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

# నాణ్యతలేని విద్యుత్ సరఫరాతో మోటార్లు కాలిపోయి రైతులపై అదనపు భారం

## లివిద్యుత్ కోతలపై దరూర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతుల ధర్నా

## రైతులకు మద్దతు తెలిపిన బిజెపి జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి



1)ధరూర్ విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న రైతులు



మల్దకల్ ప్రధాన రహదారిపై బైఠాయించి విద్యుత్ సమస్యపై ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

**గద్వాల జిల్లా ప్రతినిధి (దరూర్), సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**

వ్యవసాయానికి సరిపడ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, లో-వోల్టేజ్ మరియు విద్యుత్ అంతరాయాల కారణంగా మోటార్లు కాలిపోయి రైతులు నష్టపోతున్నారని బిజెపి జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి ఆరోపించారు.గురువారం దరూర్ మండల కేంద్రంలోని 33/11 కె వీ సబ్ స్టేషన్ ఎదుట వ్యవసాయ విద్యుత్ కోతలకు నిరసనగా మండల రైతులు చేపట్టిన రోడ్డు ధర్నా కార్యక్రమానికి బిజెపి నాయకులతో కలిసి డికె. స్నిగ్ధ రెడ్డి పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా డికె. స్నిగ్ధ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నా, క్షేత్రస్థాయిలో కనీసం 12 గంటలు కూడా విద్యుత్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. పగటిపూట కరెంట్ లేక రైతులు రాత్రి వేళల్లో ప్రాణాలకు తెగించి పొలాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు.విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపాలు, తీవ్రమైన లో-వోల్టేజ్ వల్ల వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోతున్నాయని, దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను అత్యవసర ప్రాతిపదికన మార్చాలని, విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు ధీటుగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను సమర్థవంతంగా అమలు చేసి పంట నష్టపరిహారం అందించాలని కోరారు.విషయంతెలుసుకున్న విద్యుత్ శాఖ ఎస్ ఇ అబ్దుల్ కరీమ్, డిఇ రవి ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో, నాయకులతో చర్చలుజరిపారు.ఉన్నతాధికారులతో మాట్లాడి 2 రోజుల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని అధికారుల హామీ ఇవ్వడంతో రైతులు నిరసన కార్యక్రమాన్ని విరమించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, అక్కల రమాదేవి, జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్ర రెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న, ఓ బి సి మోర్చా అధ్యక్షుడు దాస్, జిల్లా రాజ మోర్చా ఆంజనేయులు, మండల అధ్యక్షుడు తిమ్మా రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీపాద రెడ్డి, శ్రీనివాసులు, బిజెపి సీనియర్ నాయకులు సంజీవ్ భరద్వాజ్, నర్సన్ దొడ్డి క్రిష్ణ రెడ్డి, మిర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, రజక నరసింహులు, చింత రేవుల రాజేష్ అయ్యా, హన్మంతరాయ, శేఖర్ రెడ్డి, లక్మన్న, రామి రెడ్డి, అనిల్, దామ నాగరాజు, సంజీవ రెడ్డి, యువరాజ్, సద్దల కృష్ణ, కౌన్సిలర్ శాలన్న, నాయకులు , రైతులు పాల్గొన్నారు.

**కరెంటు కోతలపై రైతుల ఆగ్రహం..**
**మల్దకల్ ప్రధాన రహదారిపై ధర్నా**

వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటికి అవసరమైన సమయంలో కరెంటు అందక పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ మల్దకల్ సబ్‌స్టేషన్ ఎదుట గద్వాల--అయిజ ప్రధాన రహదారిపై రైతులు ధర్నాకు దిగారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించే వరకు ధర్నా విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు. రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.



## శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ దాతలను సన్మానించిన కౌన్సిలర్ నాగులు యాదవ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

గద్వాల మున్సిపాలిటి పరిధిలోని హమాలీ కాలనీలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళాలు అందించిన పలువురు దాతలను 3వ వార్డు కౌన్సిలర్ నాగులు యాదవ్ మరియు కాలనీ వాసులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.ఆలయ అవసరాల నిమిత్తం విరాళాలు అందజేసిన దాతలతోనే సదరు వసతులను కౌన్సిలర్ నాగులు యాదవ్ ప్రారంభంపజేశారు.రూ. 35 వేల విలువైన వాటర్ ట్యాంక్ , పైప్‌లైన్ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ప్రతాప్ రెడ్డి,సీసీ కెమెరాలకు సంబంధించిన టీవీని బహుకరించిన ప్లంబర్ వెంకట్రాములు,రూ. 14,000 విలువైన వాటర్ మోటార్ అందించిన రామాంజనేయులు ,ఆలయ అభివృద్ధికి రూ. 10,000 నగదు రూపంలో అందించిన నవోదయ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ గిరి ఆలయకమిటి నిర్వాహకులు సన్మానించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ నాగులు యాదవ్ మాట్లాడుతూ... స్వామివారి ఆలయ అభివృద్ధికి సాయం అందించిన ప్రతీ ఒక్కరికీ కాలనీ వాసుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆంజనేయ స్వామివారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు కాలనీ ప్రముఖులు గంగాధర్ రెడ్డి, గడ్డం నరసింహా, లక్ష్మన్న, సర్వేశ్వర రెడ్డి, వెంకట్రాములు, జనార్ధన్ గౌడ్, పర్శ, శివన్న, జి. చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



## సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన ధరూర్ మండల నాయకులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ ల నుండి 15 టీఎంసీ లకు పెంచుతూ జీవో విడుదల చేయడంపై శుక్రవారం ధరూర్ మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ధరూర్ మండల కేంద్రంలో సీఎం ఎ. రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ల చిత్రపటాలకు నాయకులు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ డిఆర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. గద్వాలఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కృషి వల్ల, ప్రభుత్వం గూడెందొడ్డి రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం 15టిఎంసీలు పెంపుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో గద్వాల నియోజకవర్గంలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, చివరి ఆయకట్టు వరకు రెండు పంటలకూ నీరు లభించి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.ఈకార్యక్రమంలోనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 22ఏలో చేర్చిన భూములను విడిపించాలి

## కేపీహెచ్‌బీ, వసంత్‌నగర్--సర్దార్ పటేల్‌నగర్ కాలనీ అసోసియేషన్ల డిమాండ్

## సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆగదు... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**



కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కేపీహెచ్‌బీ డివిజన్ వసంత్‌నగర్, సర్దార్ పటేల్‌నగర్ తదితర కాలనీలకు చెందిన అసోసియేషన్ సభ్యులు తమ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఆస్తులను 22ఏ నుంచి తొలగించి, భూములను ప్రభుత్వం విడిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ భవన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసుకున్న భూములను 22ఏ జాబితాలో చేర్చడంతో తమ ఆస్తులపై హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజల ఆస్తులకు కూడా భద్రత లేకుండా పోయిందని, ప్రజల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని వారు ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. 22ఏ సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**కూకట్‌పల్లి నియోజకవర్గమంతా సమస్యను పరిష్కరించాలి**

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో 22ఏ జాబితాలో చేర్చిన ప్రజల భూములను వెంటనే ఆ జాబితా నుంచి తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్క కూకట్‌పల్లి నియోజకవర్గానికే పరిమితమైన సమస్య కాదని, రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రజలు ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆస్తులకు సంబంధించిన సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి 22ఏలో చేర్చిన భూములపై సమగ్ర పరిశీలన జరిపి, అర్హులైన ప్రజల ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తుల పరిరక్షణ కోసం అవసరమైన స్థాయిలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, ఆవుల రవీందర్‌రెడ్డి, పగడాల శిరీష్ బాబూరావు, సబిహా గౌసుద్దీన్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జగన్ గురూజీ ఆధ్వర్యంలో 36 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక, ఆరోగ్య సేవలు

### లోధా రోడ్ లో 150 మందికి పైగా మహిళలతో ఘనంగా వరలక్ష్మీ వ్రతం

### పాల్గొన్న కూకట్‌పల్లి సీనియర్ నాయకులు గొట్టుముక్కల దేశాల్, యువ నాయకులు గాదె శివ

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**

అన్నపూర్ణాదేవి అమ్మవారి ఉపాసకులు, యోగ విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపకులు జగన్ గురూజీ ఆధ్వర్యంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా లోధా రోడ్‌లోని గురుస్థానంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు.తొలుత 108 మంది సుమంగళులతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించాలని సంకల్పించగా, భక్తుల విశేష స్పందనతో 150 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. శ్రీ వరలక్ష్మీ అమ్మవారికి బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన చేశారు. జగన్ గురూజీ అందించిన పసుపు, కుంకుమతో పాటు అమ్మవారికి సమర్పించిన వస్త్రాలను భక్తులు స్వీకరించారు. అనంతరం మహిళలకు చీరలను అందజేశారు. అలాగే జీహెచ్ఎంసీ కార్మికులకు కూడా వస్త్రాలను దానం చేశారు. కార్యక్రమం అనంతరం అన్నపూర్ణాదేవి ప్రసాదంగా అన్నదానం నిర్వహించారు.జగన్ గురూజీ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో దేశాల్ మిత్రమండలి వ్యవస్థాపకులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల దేశాల్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గాదె శివ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అసోసియేషన్ సభ్యులు, భక్తులు, శిష్యులు, ప్రసాద్, శ్రీధర్ రెడ్డి, దేశాల్ మిత్రమండలి సభ్యులు, మానవసేవే మాధవసేవ వ్యవస్థాపకులు లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి సుధీర్, రంగమోహన్, సత్యా, వరుణ్, రవి, సూరి బాబు, ప్రెసిడెంట్స్ సంధ్య రాణి, కల్పన, రజని, జయ, రాజేశ్వరి, అపర్ణ, అరుణ, విజయ, మహిళలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న జగన్ గురూజీ సేవలు అభినందనీయం: గాదె శివఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గాదె శివ మాట్లాడుతూ, జగన్ గురూజీ ఆధ్వర్యంలో శ్రీ వరలక్ష్మీ అమ్మవారికి బంగారు పుష్పాలతో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో 150 మందికి పైగా మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొనడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. మహిళలు భక్తిపూర్వకంగా కుంకుమార్చనలో పాల్గొనడంతో పాటు, వారికి చీరలు, జీహెచ్ఎంసీ కార్మికులకు వస్త్రాలను దానం చేయడం అభినందనీయమన్నారు. అక్కాచెల్లెళ్లతో కలిసి ఇలాంటి పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ, ఇతరులను కూడా ఇలాంటి కార్యక్రమాల వైపు ప్రోత్సహిస్తున్న జగన్ గురూజీ వంటి ఆధ్యాత్మిక సేవాభావం కలిగిన వ్యక్తులు కూకట్‌పల్లి నియోజకవర్గంలో, ముఖ్యంగా కేపీహెచ్‌బీ ప్రాంతంలో ఉండటం మన అదృష్టమని గాదె శివ అన్నారు.అన్నపూర్ణాదేవి కృపతో ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు,ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని, కూకట్‌పల్లి ప్రాంతం సుభిక్షంగా ఉండాలని జగన్ గురూజీ ఆకాంక్షించారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

**గద్వాల, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

గద్వాల పట్టణ కేంద్రంలోని బాలభవన్ లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, ఎంపీడీవో శైలజ ,ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్ ,కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు విష్ణు, రమణ ,రేణుకా దేవి ,జహీరుద్దీన్ శోభారాణి,శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు వేణుగోపాల్ రెడ్డి తిమ్మప్ప ఈదన్న పాల్గొన్నారు.



## భక్తులతో క్రిక్కిరిసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

ఈనెల 25 వరకు ఉడిపి పాలిమర్ మఠం పీఠాధిపతుల చాతుర్మాస దీక్షలు... ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం శుక్రవారం శ్రావణ అమావాస్య కావడంతో వేలాది మంది భక్తులతో క్రిక్కిరిసిపోయింది. కర్ణాటక ,తెలంగాణ ,ఏపీ తదితర ప్రాంతాల భక్తులతో దేవాలయ పరిసరాలు శ్రీ ఆంజనేయ స్వామి దర్శనం కొరకు క్యూ పద్ధతిలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానా అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు స్వామి వారికి దాసంగం ప్రసాదం సమర్పణ చేశారు. వాహనాలకు ప్రత్యేక పూజలు భక్తులు చేయించుకున్నారు. అనంతరం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

**ఉడిపి,పాలి పీఠాధిపతుల పూజలు..**

పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఉడిపి,పలిమారు పీఠాధిపతులు 1008 శ్రీ విద్యాదీశ తీర్థ శ్రీపాదుల వారు, శ్రీ 1008 శ్రీ విద్యా రాజేశ్వర తీర్థ శ్రీపాదుల ఫార్ములా ఆధ్వర్యంలో మూలరాముల సంస్థాన పూజ నిర్వహించి దశవిదహారతులు సమర్పించారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాగవత, రామాయణ ప్రవచనాలను చేశారు. భక్తులకు మంత్రక్షలు తీర్థం పంపిణీ చేశారు. చాతుర్మాస్య దీక్షలు ఈనెల 25 వరకు ఉన్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరి రావు, ఆలయ ఈవో రాజేశ్వర శర్మ ,ఆలయ అర్చకులు ఆద్య వామనాచారి, ఆధ్యా కిష్టాచారి,ఆద్య మద్వాచారి, భక్తులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలకు అటవీ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

**అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పీసీసీఎఫ్ వినయకుమార్ తదితరులు.**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

అటవీ అమరవీరుల త్యాగాల స్ఫూర్తిగా తెలంగాణ అటవీ సంపదను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అడవులు, వన్యప్రాణుల సంరక్ష రక్షణ విధుల్లో జరిగిన, జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఫ్రంట్‌లైన్ అటవీ సిబ్బందికి ఆయుధాలు సమకూర్చే ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేధించినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్ ప్రధాన ప్రాంగాణంలో జరిగిన జాతీయ అటవీ అమరవీరులు సంస్మరణ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జూపల్లి వైరా ఎమ్మెల్యే బానోత్ రాందాస్ నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, తెలంగాణ అటవీశాఖ అధిపతి వినయకుమార్ తదితరులతో కలిసి అమరవీరుల స్థూపం పై పుష్పగుచ్చాలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో తమ ప్రాణాలను ఫణంగా పెడుతున్న అటవీ సిబ్బంది భద్రత తో పాటు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అటవీ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అటవీ సంరక్షణను మరింత బలోపేతం చేయాలని కోరారు. అటవీ రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. అటవీ నేరాలు, కలప అక్రమ రవాణా, అటవీ ఆక్రమణలు, వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో నిరంతర చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. అటవీశాఖను బలోపేతం చేయడానికి ప్రజా ప్రభుత్వం 18 అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పోస్టులు, రులను, 15 ఫారెస్ట్ రేంజ్ పోస్టులతో పాటు 1393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర పరిపాలన విభాగాలతో కలిపి 1,516 ఉద్యోగాల నియామకాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా ఆ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 2014 నుంచి జూలై 2026 వరకు 1,06,685 కేసులు నమోదు చేయగా, తద్వార రూ. 55.99 కోట్ల విలువైన కలపకు సంబంధించిన కేసులు, రూ. 160.75 కోట్ల కంపౌండింగ్ ఫీజు వసూలు చేసినట్లు, ఆయా కేసులకు సంబంధించి 19,482 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే అదనంగా 31,523 యూడీఓఆర్ కేసులు నమోదు చేసి రూ. 70.72 కోట్ల విలువైన కలపను స్వాధీనం చేసుకుని కలప డిపోలకు తరలించినట్లు తెలిపారు. 11,824 అటవీ ఆక్రమణ కేసులు కూడా నమోదనట్లు వెల్లడించారు. సిబ్బందికి రక్షణ కల్పించడంతో పాటు కమ్యూనికేషన్, వాహనాలు, సాంకేతిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు.

**ఐఎఫ్ఎస్ హోదాలో మా నాన్న అటవీశాఖ ఉద్యోగిగా పదవీ విరమణః డిజిపి సీవీ ఆనంద్**

అటవీ శాఖతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని డిజిపి సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా అటవీశాఖలో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన తన తండ్రి ఐఎఫ్ఎస్‌హోదాలో జిల్లా అటవీశాఖ అధికారిగా పదవీవిరమణ చేసినట్లు గుర్తు చేశారు. బెల్లంకొండ తదితర అటవీ ప్రాంతాల అడవులు నాడు ఏలా ఉండేది, నేడు ఉన్న పరిస్థితులు ఆందోళన కరంగా ఉన్నాయని చెప్పారు. అడవుల పరిరక్షణతోనే వన్యప్రాణుల ఆవాసాలు సురక్షితంగా ఉంటాయని, అలాగే పర్యావరణ సమతూకానికి కాపావాల్సిన అవశ్యత ఎంతో ఉందన్నారు. లేని పక్షంలో ఇటీవల జరిగిన



నేపాల్ వరదలతో పాటు ప్రపంచంలోని కొన్ని దేశాలలో వెలుగు చూసిన ప్రకృతి విలయతాండవం ఇక్కడ తప్పదని గుర్తు చేశారు డిజిపి. ఈ నేపథ్యంలో అటవీశాఖ ప్రభుత్వానికి ప్రతిపాధించిన ఆయుదాల అంశంలో పోలీస్ శాఖ తరపున కావలసిన మద్దతునిస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పీసీసీఎఫ్ వినయకుమార్, పీసీసీఎఫ్ (డెవలప్మెంట్) రత్నాకర్ జోహరి, టీజీఎఫ్డీసీ- వీసీ అండ్ ఎండీ సునీతా భగవత్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ సి. శరవణన్, డాక్టర్ ప్రియాంక వర్గీస్, ఫారెస్ట్ అకాడమీ అధనపు డైరెక్టర్ ఎస్. రమేష్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, కంపా చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ఎన్.క్షితిజ, జూపార్కుల డాక్టర్ సునీల్ ఎస్. హిరేమత్, నెహ్రూ జూలాజికల్‌పార్క్ క్యూరేటర్ జె. వసంత, జిహెచ్ఎంసి అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ సుభద్రాదేవి, ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్ కుమార్, జూపార్క్ మాజీ క్యూరేటర్ బి.శ్రీనివాస్, డిప్యూటీ క్యూరేటర్ జె.మురళీధర్, అసిస్టెంట్ క్యూరేటర్లు బి.లక్ష్మణ్, నజియా తబస్సుమ్ తోపాటు పలువురు మాజీ అటవీశాఖ అధికారులు, వివిధ ప్రాంతాల, జిల్లాల అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



## రెండవ వార్డులో ఇంటింటి మొక్కల పంపిణీ కార్యక్రమం

**కొత్తకోట, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవశీ లో ఇంటింటి మొక్కల పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది రెండవ వార్డులో మంగయ్య గుడి దగ్గర ఇంటింటి మొక్కలను పంపిణీ చేశారు. రెండవ వార్డ్ కౌన్సిలర్ కరాటే అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని కొత్తకోట మున్సిపల్ చైర్మన్ అరుణ శ్రీనివాస్ , వైస్ చైర్మన్ పల్లవి కృష్ణారెడ్డి , మున్సిపల్ కమిషనర్ సైదులు , కౌన్సిలర్స్ బోయెజ్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్ కరాటే అబ్దుల్ నబీ , సలీం ఖాన్ మురళి యాదవ్ కో ఆప్షన్ సభ్యులు తయ్యాప్ హాఫీజ్ సీనియర్ నాయకులు రాచాల నాగరాజు శ్రీ హరీష్ యాదవ్ మైనుద్దీన్ ఎస్ కె బాబా అజ్మీర్ మహబూబ్ మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తులకు సెప్టెంబర్ 15 వరకు అవకాశం

**జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి.**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**



చేయూత పెన్షన్ పథకం కింద కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు 2026 సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉన్నందున, అర్హత కలిగిన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అర్హులు సంబంధిత మండల కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. పట్టణ ప్రాంతాల్లో అర్హులైన వారు సంబంధిత మున్సిపల్ కార్యాలయాలు, జిహెచ్ఎంసి కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తులు సమర్పించుకునే అవకాశం ఉంది. అందుబాటులో ఉన్న ఈ ప్రత్యక్ష దరఖాస్తుసదుపాయాన్ని వినియోగించుకుని గడువు తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు.



## ధరూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రశంసా పత్రాలు అందుకున్న మండల స్థాయి ఉపాధ్యాయులను శుక్రవారం ధరూర్ ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడిఓ, మండల విద్యాధికారి, అయా గ్రామ సర్పచులు సన్మానించారు. విద్యార్థులను భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంతో కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ధరూర్ సర్పంచ్ విజయ్ కుమార్, ఎంఈఓ పి. రవీంద్రబాబు , వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## గద్వాల్‌లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

తమ సమస్యలు పరిష్కరించాలని దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం గద్వాల జిల్లా కేంద్రంలో బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. యూనైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో బ్యాంకులకు 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఉద్యోగులు ర్యాలీ చేశారు. ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని, పీఎల్ఐని ఉపసంహరించుకోవాలని, ఇతర పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 28, 29, 30 తేదీల్లో ముడు రోజులు తిరిగి సమ్మె చేస్తామన్నారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే అక్టోబరు 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

# దుర్గం చెరువులోకి మురుగునీరు చేరకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి

**వర్షం లేని రోజుల్లో నాలాల్లో మురుగునీటి ప్రవాహం లేకుండా కార్యాచరణ**

**ప్రైవేట్ ఎస్టీపీల పనితీరు, నీటి విడుదలపై సమగ్ర పరిశీలన**

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ట్రంక్ మెయిన్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

**దుర్గం చెరువును సందర్శించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**




హైదరాబాద్ నగరానికి ప్రతిష్టాత్మకమైన దుర్గం చెరువులోకి మురుగునీరు చేరకుండా తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన దుర్గం చెరువును సందర్శించి, చెరువులోకి చేరుతున్న నాలాలు, మురుగునీటి ప్రవాహాలు, ఎస్టీపీలు, వర్షపు నీటి కాలువలు, మురుగునీటి మళ్లింపు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించి చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. దుర్గం చెరువులోకి ఏ మార్గం ద్వారా ఎంత నీరు వస్తోంది, అందులో మురుగునీరు ఎంత, శుద్ధి చేసిన నీరు ఎంత, వర్షపు నీరు ఎంత అనే వివరాలను పక్కాగా గుర్తించాలని ఎండీ ఆదేశించారు. వర్షం లేని రోజుల్లో నాలాల్లో మురుగునీటి ప్రవాహం లేకుండా చేయడమే లక్ష్యంగా, వచ్చే మురుగునీటిని పూర్తిగా అడ్డుకుని ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా ఎస్టీపీకి తరలించే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. నాలాల ప్రారంభ స్థానం నుంచి చెరువు వరకు అన్ని ప్రవాహ మార్గాలను గుర్తించి ఒకటి రెండు రోజుల్లో సమగ్ర ప్రవాహ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్ల సామర్థ్యం, ప్రవాహ స్థాయిలు, గ్రావిటీ ద్వారా నీటి ప్రవాహం, ఎస్టీపీల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించి అవసరమైన చోట కొత్త మురుగునీటి లైన్లు, ట్రంక్ మెయిన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ప్రస్తుత అవసరాలతో పాటు 2047 నాటికి పెరిగే మురుగునీటి పరిమాణాన్ని దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలన్నారు. దుర్గం చెరువు పరివాహక ప్రాంతంలోని హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, ఎత్తైన భవనాలు, నివాస సముదాయాలు తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేట్ ఎస్టీపీలపై సమగ్ర సర్వే చేపట్టాలని ఎండీ ఆదేశించారు. ఆయా భవనాల్లో ఎంత మురుగునీరు ఉత్పత్తి అవుతోంది, ఎస్టీపీ సామర్థ్యం ఎంత, వాస్తవంగా ఎంత నీటిని శుద్ధి చేస్తున్నారు, శుద్ధి చేసిన నీటిని ఎక్కడ వినియోగిస్తున్నారు, మిగిలిన నీటిని ఎక్కడ విడుదల చేస్తున్నారనే వివరాలను సేకరించాలన్నారు. వర్షపు నీటి కాలువల్లోకి మురుగునీరు చేరుతోందా అనే అంశాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల నుంచి విడుదలయ్యే నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రవాహాన్ని కొలిచే మీటర్లు ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన నీరు మాత్రమే బయటకు విడుదలవుతోందని నిర్ధారించాలని చెప్పారు. మురుగునీటి వ్యవస్థ, వర్షపు నీటి వ్యవస్థలను పూర్తిగా వేరు చేసి, అవసరమైతే ప్రత్యేక మురుగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రధాన ట్రంక్ మెయిన్‌కు అనుసంధానించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. వర్షాల సమయంలో నాలాల ద్వారా చెరువులోకి వచ్చే తేలియాడే చెత్త, ప్లాస్టిక్ తదితర వ్యర్థాల కారణంగా దుర్వాసన ఏర్పడే అవకాశాన్ని అధికారులు ఎండీకి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన, సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కాకుండా చెత్త, మురుగునీరు ఎక్కడి నుంచి వస్తున్నాయో మూలస్థాయిలో గుర్తించి అక్కడే అడ్డుకునే చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రస్తుతం చేపడుతున్న పూడికతీత, పైప్‌లైన్ అనుసంధానం, మురుగునీటి మళ్లింపు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్టీపీ పనిచేయని సందర్భాల్లో లేదా ప్రవేశ మార్గాల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు మురుగునీరు తిరిగి కాలనీల వైపు వెళ్లకుండా ప్రత్యామ్నాయ మళ్లింపు వ్యవస్థ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు.

ఇప్పటికే ఉన్న ఎస్టీపీల సామర్థ్యాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అదనపు స్థలం లేదా భారీ నిర్మాణాలు అవసరం లేకుండా పెంచే అవకాశాలను అధ్యయనం చేయాలని ఎండీ సూచించారు. ప్రస్తుత, భవిష్యత్ మురుగునీటి పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకుని ఎస్టీపీ సామర్థ్య పెంపునకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.


దుర్గం చెరువు హైదరాబాద్‌కు ప్రతిష్ఠాత్మకమైన ప్రాంతం. నిధుల కంటే శాశ్వత పరిష్కారమే ముఖ్యం. వర్షం లేని సమయంలో నాలాల్లో మురుగునీరు ప్రవహించకుండా, మొత్తం మురుగునీటిని శుద్ధి కేంద్రాలకు తరలించే సమగ్ర వ్యవస్థను రూపొందించాలి. చెరువులోకి మురుగునీరు చేరకుండా మూలస్థాయి నుంచి చివరి వరకు పక్కా కార్యాచరణ ఉండాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. చెరువుల జల సమతుల్యతకు శుద్ధి చేసిన నీటిని మళ్లించాలి:

ఎస్టీపీల్లో శుద్ధి చేసిన మురుగునీటిని వృథాగా పోనివ్వకుండా, సమీప చెరువులకు మళ్లించి వాటిలో సహజ జలచక్రం, నీటి సమతుల్యతను కాపాడేలా చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్టీపీల వారీగా అందుబాటులో ఉన్న శుద్ధి చేసిన నీటి పరిమాణం, సమీప చెరువుల అవసరాలను అంచనా వేసి, అవసరమైన పైప్‌లైన్లు, పంపింగ్ వ్యవస్థలు, ఇతర మౌలిక వసతులతో చెరువుల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో హైడ్రా, సీఏంసీ, హెచ్ఎండీఏ, నీటిపారుదల శాఖలతో పాటు సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమన్వయంతో భూసంబంధ అనుమతులు, పైప్‌లైన్ మార్గాలు, నాలాలు, నీటి ప్రవాహ మార్గాలకు సంబంధించిన అంశాలను ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సాంకేతికంగా, ఆర్థికంగా సాధ్యమైన ప్రతిపాదనలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ఈడీ సంతోష్, ఎస్టీపీ సీజీఎం పద్మజ, జీఎం హరిశంకర్ సంబంధిన అధికారులు పాల్గొన్నారు.

# గద్వాల మండలం ఎంపీయూపీఎస్‌ను పరిశీలించిన డీఈవో విజయలక్ష్మి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(ప్రభాత ఉదయం)**

గద్వాల మండలం గుంటిపల్లిలోని ఎంపీయూపీఎస్ పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కె. విజయలక్ష్మి సందర్శించి పాఠశాల విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యసన స్థాయి, రికార్డుల నిర్వహణ , మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా 3, 4, 5 మరియు 6వ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని డిఇఓ స్వయంగా పరిశీలించి, విద్యార్థులు మంచి ప్రతిభ కనబరుస్తున్నట్లు గుర్తించారు. ఇదే స్థాయిని కొనసాగిస్తూ, మరింత మెరుగైన అభ్యసన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో లైబ్రరీ, పిటిఎం రిజిస్టర్,



విద్యార్థుల అసైన్‌మెంట్లు, ఎఫ్ఏ -1 రికార్డులు, మూవ్‌మెంట్ రిజిస్టర్, కిచెన్ గార్డెన్ మరియు మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించి, అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు విద్యార్థుల అభ్యసన ప్రమాణాల పెంపుదలకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థితో డిఇఓ ప్రత్యేకంగా మాట్లాడి, విద్యా ప్రగతి , అవసరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలలో ఏర్పాటు చేసిన ర్యాంప్, రైలింగ్ సదుపాయాన్ని పరిశీలించి, ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు సమాన విద్యా అవకాశాలు మరియు సురక్షితమైన పాఠశాల వాతావరణం కల్పించాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, అభ్యసన ఫలితాల మెరుగుదల మరియు పాఠశాల నిర్వహణలో మరింత నాణ్యత సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి ఉపాధ్యాయులకు సూచించారు.



## ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రభాత ఉదయం)**

రాబోయే ఖరీఫ్ 2026-27 ధాన్యం సేకరణ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ 1వ తేదీ నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, ఇతర సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర , ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు విధానానికి సంబంధించిన వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వం గుర్తించిన సన్న రకం ధాన్యం వివరాలను పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు చేసి, సంబంధిత కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ఎటువంటి జాప్యం లేకుండా ఏర్పాటు చేయాలని తెలిపారు. డి ఆర్ డి ఓ , సహకార శాఖలు సెప్టెంబర్ 30వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్దేశించిన 16 మౌలిక సదుపాయాల ప్రమాణాలు తప్పనిసరిగా అమలయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులతో ముందస్తు సమన్వయం చేసుకొని, ప్రారంభంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అనంతరం రైస్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన హమాలీలు, లారీలను ముందుగానే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిబంధనలు, ధాన్యం నాణ్యత ప్రమాణాలు, గ్రేడింగ్ తదితర అంశాలను కచ్చితంగా పాటించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వనజాత, ఇంచార్జీ డిఎం సివిల్ సప్లయ్ స్వప్న, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి మహమ్మద్ రియజుద్దీన్, డి.సి.సి.ఓ సుధాకర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608